# పదవ ప్రసంగము

శ్రీప్రకాశానందస్వామివారు త్ర్యంబకభాయితో జామనగరు నుండి పీరడియా వెళ్ళినపుడు డా. పీరజీభాయి ఇట్లనిరి. "నేనుకూడ తమతో నిత్యానందస్వామివారి దర్శనమునకు రావలెనని యున్నది. కాని తొందరపని ఉండుటవలన ఆగవలసి వచ్చినది. మరియొకమారు తమరు వెళ్ళునపుడు నేనుకూడ వచ్చెదను.

ఏడు ఎనిమిది మాసముల తరువాత ప్రకాశానందస్వామివారు పోరుబందరు వెళ్ళిరి. అక్కడనుండి వారు పీరజీభాయికి ఉత్తరము వ్రాసిరి. "నేను పీరడియా వెళ్ళవలసి యున్నది. కావున ఫలానా రోజున పీరడియా రమ్ము" ఇట్లు స్వామి ప్రకాశానందజీ డాక్టరు పీరజీభాయి ఇరువురు పీరడియాలో కలసిరి.

శ్రీ నిత్యానందస్వామివారితో జరిగిన సంభాషణలో పీరజీ భాయి ఇట్లనెను. మొదట బెల్గాములో ప్లేగు వచ్చినపుడు నేను ప్లేగుడ్యూటీలో ఉంటిని. అప్పుడు శ్రీప్రకాశానందస్వామివారి గురుశ్రీ లల్లూభాయిగారు బెల్గాములో ఉండిరి. బెల్గాములో వారు ఒకరే గుజరాతీ. బయటినుంచి ఎవరైన గుజరాతీవారు వచ్చినచో మొదట వారే ఆహ్వానించెడివారు. నాకుకూడ వారి అతిథిగానుండు భాగ్యముకలిగెను. శ్రీప్రకాశానందస్వామివారు కూడ అక్కడనే ఉండిరి. ఇది జరిగి 20, 25 సంవత్సరములు అయినది. మా అబ్బాయి త్ర్యంబకభాయి అనారోగ్యముచే శ్రీప్రకాశానందస్వామివారి దర్శనాభిలాషకలిగి వారిని మాయింటికి ఆహ్వానించితిమి. మొదట నేను వారిని కాషాయాంబరములతో చూచితిని. కాని ఇప్పుడు వారు చేతిలో హాండీ, శరీరముపై పాతగుడ్డలు కల వేషముతో ప్రత్యక్షమయారు. ఈవేషము చూడగా వీరినెందుకు రప్పించామా యని

మనస్సులో బాధ కలిగెను. కాని, ప్రసంగానంతరము చాలకాలము క్రిందటి పరిచయము బయట పడినది.

## పతికిని, సన్యాసికిని మంచివేషము అక్కరలేదు.

స్వా. ని:— త్యాగపురుషులు మంచివేషము వేయరు. జనులకు ఇష్టములేని వేషమే వేయుదురు.

"సువర్ణం పట్టచైలం చ శోభా స్యాత్ వారయోషితామ్" అని చెప్పబడినది. స్వర్ణాలంకారములు, పట్టువస్త్రములును ఇవి అన్నియు వేశ్యలకు శోభ కలుగజేయును. పతివ్రత ఒకేభర్తకు ఆనందము కలుగజేయును. ఆమెకు వస్త్రాలంకారముల అవసరమేమి? భర్త ఆమె శీలము మొదలగువానిచే సంతోషించును. వేశ్య ప్రపంచమును ఆనందింపజేయుటకు అనేక భూషణాదులు ధరించి ఆడంబరముతో నుండవలెను. ఈవిషయమున భక్తవర్యుడగు "అఖా" ఇట్లు చెప్పెను—

పతివ్రితా తే, జె పతినే భజే, అనాయాసే అవరనే తజే;
తేనాం వస్త్ర సాంధ్యాం జేమ తేమ, తేనీ బరోబరీ వేశ్యా కరశే కేమ?
అఖా పతివ్రితా కురూపిణీ హోయి, పణ మోటోగుణ
మాంహే పతివ్రిత జోయి,
పతివ్రితా తే, జె సాచుం వదే, సాచుం బోల్యుం కేనేన సదే;
సాచుం తో లీమడానుం సాన్, తేమ కడవుం లాగే సర్వే జ్ఞాన్;
కడవే రోగ కాయానో జాయి, అఖా మీఠా ణే రోగ బమణో థాయి.

"పతివ్రత భర్తనుతప్ప మరెవ్వనిని కన్నెత్తి చూడదు. ఆమె చినిగిన కుట్టిన గుడ్డలను ధరించినను వేశ్య ఆమెకు సాటియగునా? ఓ అఖా! పతివ్రిత ఎంత కురూపిణియైనను సౌశీల్యగుణముచే ఆమె శోభిల్లును. ఆమె సత్యమునే ఎల్లప్పుడును పలుకును. సత్యమే హితమైనది. సత్యము వేపాకువంటిది. అట్టులనే జ్ఞానముకూడ వేపాకువలె

చేదుగా నుండును. కాని వేపాకు రోగహారి. మధురపదార్థములు రోగమును హెచ్చించును.''

ఇటులనే భగవంతుని రంజింపచేయవలసినవారికి చినిగినబట్టలు అడ్డురావు. ప్రపంచమును రంజింపజేయ దలచినవారికి మాత్రము వస్త్రాలంకారములు కావలెను.

శాస్త్రమునందు ఇట్లున్నది.

*విశీర్ణాన్యమలాన్యేవ చైలాని గ్రథితాని తు,*
*కృత్వా కన్థాం బహిర్వాసో ధారయేత్ ధాతురఞ్జితామ్॥*

"ప్రజలు బైట పారవేసిన,చినిగిన పాతగుడ్డపీలికలను తీసుకొని, శుభ్రము చేసుకొని,బొంత కుట్టుకొని, కాషాయవర్ణము వేసికొని ధరించవలెను.''

అలింగసన్యాసులు రంగువేయకుండ ధరింతురు. లింగసన్యాసులు రంగువేసికొని ధరింతురు.

స్వామివారు మొదట లింగసన్యాసమున ఉండిరి. ఇప్పుడు అలింగసన్యాసములో నుండిరి. పైకి తెలియకుండుటకు ఈవేషము.

## జనసంపర్కము విడనాడుట సన్యాసుల ధర్మము.

*విద్వాన్ స్వదేశముత్సృజ్య సంన్యాసానన్తరం స్వతః ।*
*కారాగారవినిర్ముక్తచోరవత్ దూరతో వసేత్॥*

"సన్యాసమును స్వీకరించిన తరువాత విద్వాంసుడు తనకు పరిచయముకల ప్రదేశమును త్యజించి ఖైదునుండి బయటకువచ్చిన దొంగవలె ప్రజలకు దూరముగా ఉండవలెను.'' అని ఉపనిషత్తులు చెప్పుచున్నవి.

ఒకప్పుడు భర్తృహరియును, గోపీచందుడు కలసి ఉండిరి. ఒకనాడు వారు సంచారముచేయుచు ఒక రాజ్యపు ప్రధాననగరము బయటకు చేరిరి. ఎవరో అచ్చటిరాజునకు "భర్తృహరియును, గోపీ

చంద్రుడును వచ్చినారని తెలిపిరి. ఇది తెలిసికొని రాజు వేగముగ వారిరు వురును వేంచేసియున్న ప్రదేశమునకు వెళ్ళెను. అప్పటికి భర్తృహారియు గోపీచంద్రుడును భిక్షను తెచ్చుకొనియుండిరి. రాజు వారిని కలసికొను టకు వచ్చుచున్నాడని భర్తృహరికి తెలిసెను. "మనము ఏదో ఒక యుక్తి చేసి ఈ కలయికనుండి విముక్తిని పొందవలెను." అని గోపీ చందునితో ఆలోచించెను. వారు అంతట వ్యాజమును కల్పించుకొని ఇట్లు పోట్లాడుకొనిరి:— "నేను తెచ్చిన రొట్టెలలో ఎక్కువ భాగము నీవు ఏల తీసికొంటివి?" అని భర్తృహరి గోపీచందునితో అనెను. అంతట గోపీచందుడు ఇట్లు సమాధానము చెప్పెను:— నిన్న నేను చాలరొట్టెలు అడిగి తెచ్చితిని. నీవు ఎక్కువ ఇచ్చితివా!" ఇట్లు వారు ఇరువురు రొట్టెముక్కలు ఎదుట నుంచుకొని పోట్లాడసాగిరి. అంతట రాజు తనవద్దకు పైవార్తను తెచ్చిన వ్యక్తిపై కోపమువహించి ఇట్లనుకొనెను:— ఈవిధముగా రొట్టెలకొరకు పోట్లాడువారు గోపీచం దుడును, భర్తృహారియును ఎట్లు అవగలరు? వీరు భిక్షుకులు. రొట్టె ముక్కలకొరకు పోట్లాడుచున్నారు. ఇట్లనుకొని మరలిపోయెను.

అట్లు ఈ ప్రకాశానందస్వామివారుకూడ గుప్తముగా నుండు టకు అలింగసన్యాసమును తీసికొనిరి.

స్వా. ప్రి:— తమరు నావిషయములో గొప్పగొప్ప ఉపమాన ముల నిచ్చుచున్నారు. సన్యాసముసంగతి అటు ఉండనిండు. నేను హిందువుడను కాను. మహమ్మదీయుడను కాను.

స్వా. ని॥:— (నవ్వుచు ప్రికాశానందస్వామివారితో) ఇది మరీ బాగుగనున్నది.

## హిందు, మహమ్మదీయ ఇత్యాది ఉపాధులచే దుఃఖము.

ఇద్దరు సాధువులు ఉండిరి. వైశాఖమాసములో వారి కాళ్ళు ఎండలో మాడుచుండెను. అది చూచి ఎవరో వారికి కాళ్ళకు

చెప్పులు తొడిగిరి. వారిలో ఒకడు 'దేవాలయములు, మసీదులు మొదలగు పవిత్రస్థలములకు చెప్పులతో వెళ్ళెను. "నీవు ఎవరవు" అని, ఎవ్వరైన అడిగిన "ఎవడనో ఒకడను." అని సమాధానము చెప్పెడివాడు. జనులు అతనిని పిచ్చివాడని తలచి ఆలయముబైటకు తీసికొనివచ్చి విడచెడివారు.

అటులనే రెండవవాడు కూడ చెప్పులతో మసీదులోనికి వెళ్ళెను. మహమ్మదీయులు "నీవు ఎవరవు" అని అడిగెను. ఆయన "నేను హిందువుడను" అని చెప్పెను. అంతట మహమ్మదీయులు అత నిని గట్టిగా కొట్టి తరిమివేసిరి.

దెబ్బలు తిని ఆసాధువు తనచోటికి వచ్చెను. నీరసముచే పరుండెను. రెండవ సాధువు వచ్చి అతడు. పరుండుట చూచి అడిగెను. "ఏమయినది. అపుడే ఏల పరుండుచున్నావు."

"నన్ను మహమ్మదీయులు కొట్టిరి." ఒడలు నొప్పి పెట్టుచు న్నది." అని ఆతడు జవాబు చెప్పెను.

"ఎందుకు కొట్టిరి?" అని ప్రశ్న వచ్చెను.

నీవు హిందువుడవు. చెప్పులతో మందిరములోనికి వెళ్ళితివి. అందుచే కొట్టిరి. హిందువుడను అని కాని మహమ్మదీయుడ నని కాని చెప్పకపోయినచో బాగుగ నుండును."

దీనిపై పీరజీభాయి ఈ సందేహము వెలిబుచ్చెను:—

సన్యాసి ఎప్పుడును గుప్తముగనే ఉండవలెనని శాస్త్రముల యందు విధింపబడినదా?"

## జ్ఞానుల ప్రవర్తన కళ్యాణకరమును, అనాసక్తిపూరితమును అయి ఉండును.

స్వా. ని:— అభ్యాసకాలమున సన్యాసులకు జనుల సంసర్గము విఘ్నకరము. కావున గుప్తముగా నుండవలెనని వ్రాయబడినది. కాని

ఆరూఢదశయందు కొందరు గుప్తముగా నుందురు. మరికొందరు ప్రకటముగా నుందురు. దత్తాత్రేయులవారు అగ్నిని గురువుగా స్వీకరించి ఉపదేశమును పొందెను. ఆవిషయమున భాగవతమున ఇట్లుఉన్నది:—

*క్వచిచ్ఛన్నః క్వచిత్స్పష్ట ఉపాస్యః శ్రేయ ఇచ్ఛతామ్ ।*
*భుఙ్క్తే సర్వత్ర దాతౄణాం దహన్ ప్రాగుత్తరాశుభమ్॥*

"అగ్ని కొన్నిస్థలములయందు ప్రకటముగా నుండును. మరికొన్ని స్థలములయందు రహస్యముగా నుండును. ఆ అగ్నిని కళ్యాణముకొరకు ఉపాసించవలెను. అగ్ని ఆహుతినిచ్చువాని భూతభవిష్యములయందలి పాపములను భస్మము చేయును యజ్ఞాహుతులను భక్షించును. అటులనే ఆత్మకళ్యాణముకొరకు ఉపాసనీయుడగు తత్త్వజ్ఞుడు ఒకప్పుడు రహస్యముగానుండియు, మరియొకప్పుడు ప్రత్యక్షముగానుండియు సేవింపబడును. భవిష్యత్తునందలి పాపములను దహించివేయును. భోజనాది నియమములను పాటింపడు.

గుప్తముగానుండుట, ప్రత్యక్షముగానుండుట మాత్రమేకాదు; కొన్నిసమయములయందు వారిప్రవర్తన స్థానపరత్వముచే అనేకరకములుగా కన్పించును. కాని వారికి దేనియందు ఆసక్తి యుండదు.

ఈవిషయమున శ్రీశంకరుల వాక్యము వినుడు.—

*క్వచిన్మూఢో విద్వాన్ క్వచిదపి మహారాజవిభవః।*
*క్వచిద్భ్రాన్తః సౌమ్యః క్వచిదజగరాచారకలితః ।*
*క్వచిత్పాత్రీభూతః క్వచిదవమతః క్వాప్యవిదిత*
*శ్చరత్యేవం ప్రాజ్ఞః సతతపరమానన్దముదితః॥*

బ్రహ్మజ్ఞుడు అజ్ఞానిదృష్టిలో ఒకప్పుడు మూఢునివలె నుండును. మరియొకప్పుడు విద్వాంసునివలె నుండును. ఒకప్పుడు రాజులును, ధనికులును అతనిని పూజింతురు. అతడు మహారాజవైభవమును అనుభవించును. ఒకప్పుడు పిచ్చివాడుగా కనిపించును. మరియొకప్పుడు

చాల సాధువుగా కన్పించును. ఒకప్పుడు అజగరవృత్తిని అవలంబించి శ్రమపడకుండ లభించినదానితో గడుపుకొనును. జిజ్ఞాసువులు ఒకప్పుడు అతనిని సేవింతురు. దుర్జనులు అతనిని అవమానింతురు. ఒకప్పుడు అతడు రహస్యముగా సంచరించును. ఇట్లు వారి బాహ్యవ్యాపారము అనేకరకములుగా నుండును. అయినను అతని అంతఃకరణమున నిరంతరము పరమానందము ఉప్పొంగుచుండును. అతడు సంతోషముతో నుండును.

ఈవిషయమున ఒకదృష్టాంతము కలదు.

ఒక జ్ఞాని ఉండెను. అతనిని జనులు చాల గౌరవించెడివారు. ఒకమారు రాజునకు ఆజ్ఞానిదర్శనము చేయవలెనని అతనిని తనభవనములోనికి రప్పించెను. కొంతసేపు అతనిని తనతో రాజగజముపై నూరేగించి తీసికొనివచ్చెను ప్రజలందరు ఆతడు రాజవైభవమును అనుభవించుచున్నాడనుకొనిరి. తరువాత ఆజ్ఞాని మరొకదేశము వెళ్లెను. అతడు ఒకగ్రామముచెంత నొకవృక్షముక్రింద నిద్రించుచుండెను. అచ్చట దొంగలు రాజభవనమున దొంగతనముచేసి ధనము తీసికొని వెళ్లుటకు అవకాశములేక ఈజ్ఞాని పరుండియున్న వృక్షమువద్ద పడవేసి వెళ్ళిరి. కాలిగుర్తులనుపట్టి పోలీసులు అక్కడికి వచ్చిరి. వారు అచ్చట సామాను, ధనమును పడియుండుట చూచి అతనిని పట్టుకొని మంత్రిచెంతకు తీసికొనివెళ్లిరి. మంత్రి పూర్తిగా తెలిసికొనకుండగనే అతనిని గాడిదపై కూర్చుండబెట్టి రాజాజ్ఞ అని అవమానము చేసెను. ఆగ్రామమున ఒక వర్తకుడు ఉండెను. అతని మాతృదేశము వెనుక ఈ జ్ఞాని గౌరవముపొందిన రాజ్యము. వర్తకుడు ఆతనిని గుర్తించెను. అతనికి కలిగిన దుస్థితికి వర్తకు డెంతయో విచారించి దుఃఖము నాపుకొనలేక అతనిచెంత ఏడ్చెను. కాని, ఆమహాత్ముని ముఖము పూర్వమువలెనే ఉంట్టుగాంచి

అతనికి ఆశ్చర్యము కలిగెను. "ప్రభూ, తమకు ఇంత అవమానము కలుగుచున్నను పూర్వమువలె ఆనందముతో నుండుటకు గల కారణ మేమి?" ఆయన సమాధానము చెప్పెను:— ఈశరీరము మాంసము, ఎముకలతో తయారుచేసిన బొమ్మ. దీనిని ఏనుగపై కూర్చొన పెట్టినను, గాడిదపై కూర్చొనపెట్టినను భేదము లేదు.

ఈవిధముగనే జ్ఞానులు ఎప్పుడును బ్రహ్మానందములో మునిగి యుందురు.

అటుతరువాత అందరును భోజనముచేసి మరల కూర్చొనిరి. డా॥ వీరజీభాయి ప్రశ్నించెను. మోక్షమునకు స్వరూపము ఎట్టిది? సాధనము ఏమి ?

స్వా॥ ని:—మీరు దేనిని మోక్షమని చెప్పుచున్నారు?

డా॥ వీ :—దుఃఖనివృత్తియు, సుఖప్రాప్తియు మోక్షస్వరూపము అని తలచుచున్నాను.

స్వా॥ ని॥ :—"జ్ఞానాదేవ తు కైవల్యమ్" అని శ్రుతివాక్యము. అనగా మోక్షమునకు సాక్షాత్కారణము జ్ఞానము. కాని ప్రాణులన్నిటి అంతఃకరణమునందును ఉండు మూడుదోషములును—మల, విక్షేప, ఆవరణదోషములును— ప్రాణుల దుఃఖము లన్నిటికిని కారణములు. ఈ మూడుదోషములను పోగొట్టుటచే ముముక్షువులు మోక్షసుఖమును అనుభవించెదరు. ప్రాణులయందు అనుగ్రహముచే సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు పరమేశ్వరుడు కర్మ, ఉపాసన, జ్ఞానములతో కూడినత్రికాండరూపమగు వేదమును రచించెను. తద్ద్వారా మూడుదోషములను పోగొట్టుటకు కర్మ, ఉపాసన, జ్ఞానము అను మూడు ఉపాయములను క్రమముగా వేదమునందు చెప్పెను. దోషములు మూడు అయినందున పరమాత్ముడు మూడుకాండములు రచించెను. అంతకంటె ఎక్కువ కాండలతో వేదము రచించవలసిన అవస

రము లేకపోయెను. జన్మమరణాది దుఃఖములను కలుగజేయు మల, విక్షేప, ఆవరణములు నశించుటకు అవసరమగు కర్మ, ఉపాసన, జ్ఞానము- ఈమూడును అవసరమయ్యెను. నిష్కామకర్మచే మానవుడు మలదోషమును నశింపజేసికొనవలెను.

## నిష్కామకర్మచే చిత్తశుద్ధి.

ఇహలోకముతోను, స్వర్గాదిపరలోకములతోను సంబంధము కల విషయసుఖమునకు సంబంధించిన కోరికలను త్యజించి దేవుడు ప్రసన్నుడగుటకు వర్ణాశ్రమధర్మానుసారము శాస్త్రప్రతిపాదితములగు కర్మలను చేయుటే నిష్కామకర్మయోగము. ఈ నిష్కామకర్మయోగముచే అంతఃకరణమునందలి మలదోషములనివృత్తిని పొంది వైరాగ్యాదిసాధనములు లభించును.

*స్వవర్ణాశ్రమధర్మేణ తపసా హరితోషణమ్ ।*
*సాధనం ప్రభవేత్పుంసాం వైరాగ్యాదిచతుష్టయమ్ ॥*

(అపరోక్షానుభూతి)

"తమతమ వర్ణాశ్రమములను అనుసరించి చేయు ధర్మానుష్ఠానరూపమగు తపస్సుచే పరమాత్ముడు సంతోషించును. పరమాత్ముని ప్రసన్నతచే వివేకము, వైరాగ్యము మొదలగు సంపత్తియు వైరాగ్యాది సాధనములును ముముక్షువులకు లభించును."

ఈవైరాగ్యము నిష్కామకర్మములేనిదే ప్రాప్తించదు. కర్మచే సంసారముతో ప్రాణి బద్ధుడగును. సంసారమునుండి విముక్తిని పొందుటకు నిష్కామకర్మయే ప్రథమసాధనము. సకామకర్మ బంధనమునకు కారణము. జ్ఞానసహితమగు ఈశ్వరార్పణబుద్ధితో చేయబడిన నిష్కామకర్మ సంసారమునుండి ముక్తిని పొందుటకు కారణము. భగవానుడు గీత రెండవ అధ్యాయమున చెప్పియున్నాడు,

*కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।*
*జన్మబన్ధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్ ॥*

సిద్ధియందును, అసిద్ధియందును, జయపరాజయములందును హర్షశోకములను పరిత్యజించి సత్వబుద్ధితో కేవలము ఈశ్వరార్పణ బుద్ధితో, కర్మఫలమును త్యజించి కర్మచేయుటచే విద్వాంసులు అవిద్యాబంధములనుండి నివృత్తిని పొంది ఉపద్రవరహితమగు మోక్షమును పరమపదమును పొందెదరు.

కొందరు ఇట్లనుకొనెదరు—కర్మ బంధనమునకు కారణము. కావున కామ్యకర్మములను త్యజించినట్లుగనే నిత్య, నైమిత్తిక కర్మములనుకూడ త్యజించవలెను. కేవల శ్రవణ, మనన, నిధిధ్యాసనముల చేతనే ఆత్మజ్ఞానము కలుగును. కర్మ ఆచరించవలసిన అవసరము లేదు.

కాని ఈ అభిప్రాయము నిజముకాదు. మలినమనస్కునకు ఉపదేశించినను తత్త్వజ్ఞానము కలుగదు. పైగా విరోచనునకు కలిగినట్లు విపరీతజ్ఞానము కలుగును. మలినముతోకూడిన అద్దములో ముఖప్రతిబింబము కన్పించదు. అటులనే మలినచిత్తమున జ్ఞానకాంతి ప్రతిబింబించదు. అజుడు మొదలగు ధర్మాచార పరాయణులగు రాజులకు వశిష్ఠాదులు ఉపదేశించినను విషయవాసన అనెడు మలినము ఉండుటచే జ్ఞానము కలుగలేదు. ప్రజాపతి దేహాదులకంటె భిన్నమగు ఆత్మను ఉపదేశించినను విరోచనునకు చిత్తము[illegible]దలి దోషముచే శరీరమే ఆత్మ అను జ్ఞానము కలిగెను. తన అసురసోదరులకుకూడ అతడు దేహమే ఆత్మఅనెడు ఉపదేశము నిచ్చెను.

[illegible]లనే నిష్కామకర్మచే అంతఃకరణమున పారిశుద్ధ్యమును పొం[illegible]శ్రవణాదులచే జ్ఞానప్రాప్తి యగునని చెప్పువాడు దేహాత్మ

వాదమునే పరిహారము చేయుచున్నాడని ఎరుగనగును. ఆముముక్షువునకు కళ్యాణోపదేశము కాదు చేయునది. నరకమునకు పంపుచున్నాడు. ఏలనన, అజ్ఞానముచే అర్థదగ్ధుడగు మానవునకు "నీవే బ్రహ్మము" అని చెప్పుచున్నాడు. అది అతనిని నరకద్వారమున నిలబెట్టుటతప్ప మరేమియగును? ఇది వ్యాసులవారి అభిప్రాయము. ఈకారణముననే జనకాది ముముక్షువులుకూడ నిష్కామకర్మయోగమును అనుష్ఠించిరి. భగవానుడు గీత 3 వ అధ్యాయమున ఇట్లనెను.

*కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।*
*లోకసంగ్రహమేవాపి సంపశ్యన్కర్తు మర్హసి ॥*

"పూర్వకాలమున జనకాదులుకూడ ఇటులనే నిష్కామకర్మ ద్వారా అంతఃకరణ పారిశుద్ధ్యముద్వారా ఉత్తమమగు సిద్ధినిపొందిరి. అటులనే లోకసంగ్రహార్థము నిష్కామకర్మమునందు ప్రవృత్తుడవవలెను."

లోకసంగ్రహమనగా, ఎవరికి భగవంతుని కటాక్షము కలుగునో వారు ఎట్టిఫలమును అపేక్షించక జనకళ్యాణము కొరకు నిష్కామకర్మము నాచరించి ఆదర్శపురుషులు అవవలెను. జనులుకూడ ఆ ఆదర్శపురుషులను అనుసరించి కర్మములు ఆచరించి అభ్యుదమును పొందును.

మహాభారతము ఇట్లు చెప్పుచున్నది :-

*లోకసంగ్రహ సంయుక్తం విధాత్రా విహితం పురా ।*
*సూక్ష్మధర్మార్థ నియతం సతాం చరితముత్తమమ్ ॥*

"లోకసంగ్రహార్థము కర్మములనునై ఆచరించువాడును ధర్మార్థముల సూక్ష్మతత్త్వము నెరిగినవాడు సత్పురుషుడు. అతని చరిత్రము బ్రహ్మదేవుడు లిఖించును.

## కర్మసన్యాసయుక్తమగు కర్మయోగము శ్రేష్ఠము.

కర్మయోగము, సన్యాసము రెండును పరంపరగా మోక్షము నొసగును. కాని, ఈరెంటిలోను కర్మత్యాగయుక్తమగు కర్మయోగము ఉత్తమము. ఈకర్మయోగమున లోకసంగ్రహాది గుణములు ఎక్కువగా నున్నవి. వీనికి నిష్కామకర్మము అవసరము. భగవానుడు గీత 18వ అధ్యాయమున ఇట్లు సెలవిచ్చెను.

*యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।*
*యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్॥*

"యజ్ఞము, దానము, తపస్సు అనెడు కర్మలను విడువరాదు. ఆచరించవలెను. ఫలనన, అవి మనుష్యులను పవిత్రులను చేయును."

## కర్మ భేదములు.

పైశ్లోకమున యజ్ఞ, దాన, తపోరూపమగు కర్మ కర్తవ్యము అని చెప్పబడినది. యజ్ఞములు కర్మయజ్ఞములు, ఉపాసనాయజ్ఞములు, జ్ఞానయజ్ఞములు అని మూడురకములు. అందు కర్మలు విహితకర్మలు, అవిహిత కర్మలు అని రెండువిధములు. విహితకర్మలలో ముఖ్యమైనవి కామ్యములు, నిత్యములు, నైమిత్తికములు, ప్రాయశ్చిత్తములు అని నాలుగురకములు. కొందరు సత్పురుషులు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆదిభౌతికములు అనబడు మూడు రకములగు కర్మలనుకూడ తెలుపుదురు. విహితకర్మలగు ఈ ఏడురకములగు కర్మలు కర్మయోగముగా సత్పురుషులు గ్రహింతురు.

సంధ్యావందనాదులు నిత్యకర్మలు. పుత్రోత్పత్తి ప్రయుక్త జాతకర్మ మొదలగునవి నైమిత్తిక కర్మలు. ప్రాయశ్చిత్తకర్మలు పాపమును పోగొట్టుటకు చేయబడును. పాపములు జ్ఞాతములు, అజ్ఞాతములు అని రెండురకములు. జ్ఞాతపాపములు అనగా ఈజన్మమున చేసి

నవి, జ్ఞాపకము ఉన్నవి. అజ్ఞాతపాపములు అనగా ఈజన్మమందును జన్మాంతరమునందును చేసినవియును, మరచిపోయినవియును. ఈ రెండు రకములగు పాపములను పోగొట్టుటకు చేయు ప్రాయశ్చిత్తకర్మలు అసాధారణ, సాధారణ భేదములచే రెండు రకములు. అసాధారణ, ప్రాయశ్చిత్తమునకు, పాపమును పోగొట్టుకొనుటకు ధర్మశాస్త్రము నందు విశేషకర్మ నాచరించ విధించబడినది. సాధారణ ప్రాయశ్చిత్త కర్మలు జ్ఞాతాజ్ఞాత పాపములను పోగొట్టును. చాంద్రాయణాది వ్రత ములు, గంగాస్నానము, భగవన్నామ స్మరణము మొదలగునవి.

ప్రపంచమునందలి పదార్థములను పొందుటకు చేయుబడు కర్మ ములు కామ్యకర్మలు. బాధపడువానికిని, దీనునికిని ఉపకారముచేయుట అధ్యాత్మకర్మ. ఇంద్రాదిదేవతల సంతృప్తికి చేయుకర్మ ఆధిదైవిక కర్మ బ్రాహ్మణభోజనము, గోసేవ మొదలగునవి ఆధిభౌతికకర్మలు.

ఉపాసనాభేదములు, ఉపాసనా సాధనపద్ధతి, ఉపాసనాపద్ధతి వీనినిగురించి వివరములు గ్రంథములలో నున్నవి.

మంత్రయోగము, హఠయోగము, లయయోగము, రాజయో గము అని నాల్గురకముల సాధనపద్ధతులు చెప్పబడినవి. ఉపాసనా పద్ధతిని అనుసరించి సగుణబ్రహ్మోపాసన, నిర్గుణబ్రహ్మోపాసన, దేవాది ఉపాసన, ఋష్యాదిఉపాసన, మూర్త్యుపాసన అని రీభేదములు. జ్ఞానయజ్ఞము శ్రవణము, మననము, నిదిధ్యాసనము అని మూడురక ములు. ఇట్లే కర్మయజ్ఞమునకు సాత్త్వికాదిభేదములచే 18 భేదము లును సాధనపద్ధతియును, ఉపాసనాపద్ధతియును సాత్త్వికాదిభేదము లచే 27 రకములు. జ్ఞానయజ్ఞముకూడ సాత్త్వికాదిభేదములచే 9 రక ములు. ఇట్లు 54 యజ్ఞభేదములు భగవానుడు గీతయందు చెప్పెను. ఇందు ముముక్షువు తామస, రాజస కర్మములను త్యజించి సాత్త్విక ములగు కర్మ, ఉపాసనా, జ్ఞానయజ్ఞములను అభ్యసించవలెను,

## నిష్కామకర్మమును, ఉపాసనయు ఒకేసమయమున ఆచరించవలెను.

వేదమున ఇట్లు చెప్పబడినది :—

*విద్యాం చావిద్యాం చ యస్తద్వేదోభయం సహ,*
*అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే॥*

నిష్కామకర్మ, ఉపాసన— ఈ రెంటి స్వరూపమును తెలిసికొని ఎవడు ఒకేసమయమున రెంటిని ఆచరించునో అతడు నిష్కామకర్మ అనెడు కర్మచే మృత్యువును అతిక్రమించి ఉపాసనచే ఇష్టదేవతాప్రాప్తి రూపమగు సాపేక్షిక మోక్షమును పొందును. కాల నియమముకలది సాపేక్షికమోక్షము. పరమాత్మప్రాప్తి అనెడు మోక్షము కాలసాపేక్షము కాదు. కేవలము కర్మకాని, కేవలము ఉపాసనకాని ఆచరించువానికి అనిష్టము కలుగునని శ్రుతి ఘోషించుచున్నది.

*అన్ధం తమః ప్రవిశన్తి యేఽవిద్యాముపాసతే,*
*తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాం రతాః॥*

కర్మరూపమగు అవిద్యనుమాత్రమే ఉపాసించువారు అనగా, కర్మలనుమాత్రమే చేయువారు గొప్ప అజ్ఞానమును పొందెదరు. కర్మను విడచి ఉపాసననుమాత్రమే ఆచరించువారు కర్మిష్ఠులకంటె ఎక్కువ అజ్ఞానమును పొందుదురు. కావున కర్మయును, ఉపాసనయు రెండును ఒకేమారు ఆచరించవలెను అని. శ్రుతి ఆశయము.

### ఉపాసన.

శివగీతయందు శంకరులు ఇట్లనిరి :—

*ఉపసంగమ్య బుద్ధ్యా యదాసనం దేవతాత్మనా,*
*తదుపాసనమన్తః స్యాత్తద్బహిః సంపదాదయః॥*

ఉపాసనావిషయమగు దైవము తనస్వరూపమునకు భిన్నము కాదని తెలిసికొని, అంతఃకరణమున దేవతారూపసామీప్యమును పొందుట,

అందుస్థిరముగా నుండుట ఉపాసన. ఇది ఆంతరికమగు ఉపాసన. సంపదాదిఉపాసన బహిర్గతమైనది. సామీప్యమును పొందుటను అహంగ్రహోపాసనము అందురు. అహంగ్రహోపాసన అనగా ఉపాసకుడు ఉపాస్యమును అభిన్నముగా గ్రహించి ఉపాసించుట. ఇది సగుణబ్రహ్మమునకును, నిర్గుణబ్రహ్మమునకును కూడ సరిపడును.

## బ్రహ్మముయొక్క సంపదుపాసన

సంపదాదిఉపాసన సంపత్, ఆరోప, అధ్యాస, సంవర్గ భేదలచే నాల్గురకములు. సంపదుపాసనాలక్షణము శివగీతయందు ఇట్లు ఉన్నది.

*అల్పస్య చాధికత్వేన గుణయోగాద్విచిన్తనమ్,*
*అనన్తం వై మన ఇతి సంపద్విధిరుదీరితః॥*

అల్పగుణవంత మగుదానియందు, అనంతగుణవంత మగుదానిని భావించి ఉపాసించుట సంపదుపాసన. మనస్సు అనంతమైనది అని ఊహించి ఉపాసించుట సంపదుపాసన విధి.

ఛాందోగ్యోపనిషత్తునందు అధ్యాత్మ అధిదేవ అనెడు రెండురకముల ఉపాసనాపద్ధతులును చెప్పబడినవి. అందు అధ్యాత్మసంపదుపాసన 'మనో బ్రహ్మేతి ఉపాసీత' అనువాక్యముచే చెప్పబడినది. అధిదేవ సంపదుపాసనకు రెండవమంత్రముద్వారా 'మనోమయ ఆకాశాత్మా' అని తెలుపబడినది. ఇచ్చట మనోమయుడు అనగా మనస్సంబంధముచే ప్రవృత్తి, నివృత్త్యాత్మకమగు పరమాత్ముని ఉపాసన గ్రహించవలెను. అటులనే సర్వగతుడును, సూక్ష్ముడును, రూపాదిహీనుడును అగుటచే ఆపరమాత్ముని ఉపమానము ఆకాశముతో చెప్పబడినది. ఇక్కడ ఆకాశమనోరూపుడగు బ్రహ్మముయొక్క గుణములు ఏకదేశత్వములుగా చెప్పబడినవి. రాబోవు అధ్యాయపు 18 వ ఖండమున ప్రథమమునుండియు తేజము, మనస్సు, ఆకాశము అన్నిటియందును

బ్రహ్మదృష్టి విధిపూర్వకముగా తెలుపుటకు "మనో బ్రహ్మ, ఆకాశో బ్రహ్మ" అని ప్రారంభించబడినది. "మనుతే అనేన ఇతి మనః" దేనితో ఆలోచించబడునో అది మనస్సు (అంతఃకరణము), అది బ్రహ్మము. ఈ ఉపాసనము అధ్యాత్మసంపదుపాసనము. మనస్సు ద్వారా బ్రహ్మసాక్షాత్కారము జరుగును. బ్రహ్మదర్శనమునకు యోగ్యమగు సాధనము మనస్సు. మనస్సునందు బ్రహ్మదృష్టి కలిగి యుండుట సంపదుపాసన కదా! ఆ మనస్సు అనెడు బ్రహ్మమునకు వాక్కు, ఘ్రాణము, చక్షువు, శ్రోత్రము అనెడు నాల్గుపాదములు గలవు. ఈనాల్గింటియందును మనోరూపుడగు బ్రహ్మముయొక్క పాద దృష్టిని పొందవలెను. ఆకాశరూపుడగు అధిదేవబ్రహ్మముయొక్క పాదదృష్టిని అగ్ని, వాయువు, ఆదిత్యుడు, దిక్కులు- వీనియందు పొందవలెను. ఆకాశము బ్రహ్మము అను ఉపాసన ఆధిదైవికసంప దుపాసన.

మనోబ్రహ్మముయొక్క వాగ్రూపమగు పాదము, ఆకాశ బ్రహ్మముయొక్క అగ్నిరూపమగు పాదము జ్యోతిచే భాసించును. మనోబ్రహ్మముయొక్క ఘ్రాణపాదము ఆకాశబ్రహ్మముయొక్క వాయు రూపుడగు అధిదేవతయొక్క జ్యోతిచే దీప్తిని చెందును, అనగా భాసించును. మనోబ్రహ్మపు చక్షుఃపాదము ఆకాశబ్రహ్మముయొక్క ఆదిత్యాధిదేవతచే భాసించును. అటులనే మనోబ్రహ్మముయొక్క శ్రోత్రము ఆకాశబ్రహ్మము దిగ్రూపమగు పాదముచే భాసించును.

ఈసంపదుపాసనను చేయువారు చిరకాలము దీప్తిమంతమగు ప్రపంచమున వసించి అంతమున ఉత్తమలోకములను పొందుదురు. ఇది వేదోక్తమగు బ్రహ్మముయొక్క సంపదుపాసన. సాలిగ్రామ సర్వేశ్వరాదులయందు హరిహరాదిభావనచేసి విధిపూర్వకమగు పరి చింతనము పురాణోక్తమగు సంపదుపాసనము. సాలగ్రామాదులు

అల్పగుణవంతములు, అధికగుణములుగల హరిహరాదులను వాటి యందు భావించుటచే అధికగుణ యోగము వాటికి కలుగును. అం దుచే సాలిగ్రామనర్మదేశ్వరాదులు సంపదుపాసనచే ఉపాస్యులగును. రామకృష్ణాది విగ్రహములు కూడ ఇట్లే ఉపాస్యములు.

బ్రహ్మయొక్క ఆరోపోపాసన.

*విధావారోప్య యోపాసా సారోపః పరికీర్తితః ।*
*యద్వచ్ఛోఙ్కారముద్గీథముపాసీతేత్యుదాహృతః॥ వి॥గీ॥*

"శ్రుతియందు విధించబడిన ఆరోపాత్మకమగు చింతనపద్ధతి ఆరోపోపాసన అనబడును. "ఓం" కారమును ఉద్గీథరూపమున ఉపాసిం చుట ఆరోపోపాసన అనబడును."

ప్రధానవిధి ననుసరించి సముదాయవిశేషముయొక్క అవయవ ముతో సంబంధము కలిగియుండుట ఆరోపసంపదుపాసనము. ఉద్గీథ సామముయొక్క ప్రథమభక్త్యవయవమగు ఉద్గీథశబ్దముచే వాచ్య మగు కర్మతో సంబంధము ఉంచి పరమాత్మప్రతీకమగు "ఓం" కార మునందు స్థిరబుద్ధిని నిలిపి "ఓం" కారమును ఉద్గీథరూపమున ఉపా సించవలెను. "ఓం" కారము నుచ్చరించియే ఉద్గాత సామమును గానముచేయును. కావున "ఓం" కారమే ఉద్గీథము. ఈవిషయమున ఛాందోగ్యమునందు "*ఓమిత్యేత దక్షరముద్గీథముపాసీత.*" 'ఓం' అను అక్షరమును కర్మాంగవిషయమగు ఉద్గీథరూపమున ఉపాసించవలెను. ఆ ఉచ్చారణచే పరమాత్ముడు ప్రసన్నుడగును. తనప్రియమగు నామమును అన్యులద్వారా వినుట మానవునకు సంతోషదాయకము. అట్లనే పరమాత్ముని అన్యప్రతిబింబములకు ప్రణవము ప్రతీకము. కావున ప్రణవము పరమాత్మోపాసనమునకు పరమోత్తమసాధనము. ఈకారణముననే వేదములందును, జప, కర్మ స్వాధ్యాయ, దానాదుల ఆద్యంతములయందును ప్రణవోచ్చారణము అధికముగా కానవ

చ్చును. ప్రణవము, రసములన్నిటికంటెను రసవత్తముడగు పరమాత్మనిరూపమున ఉపాసించదగినది. ఈ చరాచరాత్మక ప్రపంచమునందు పృథ్వి రసము—అనగా సారవంతమైనది. భూమికి జలము రసము. జలమునకు ఔషధులు రసము. ఔషధులయందు పురుషుడు రసము. పురుషునియందు వాణి రసము. వాణియందు ఋక్కులు రసము. ఋక్కులయందు అనగా వేదములలో సామము రసము. సామములలో పరమసారతరమయినది ఉద్గీథరూపమగు ఓంకారము. ఇది అష్టమ రసము. ఈ ఉపాసన ఆరోపోపాసనము.

## బ్రహ్మముయొక్క అధ్యాసోపాసన.

శివగీతయందు అధ్యాసమనబడు ప్రతీకోపాసనాలక్షణము ఇట్లున్నది:—

*ఆరోపో బుద్ధిపూర్వేణ య ఉపాసావిధిశ్చ సః ।*
*యోషిత్యగ్నిమతిర్యత్తదధ్యాసః స ఉదాహృతః ॥*

బుద్ధిపూర్వకముగా బ్రహ్మమును దేనియందైనను ఆరోపించుట ఉపాసన యనబడును. ద్యులోకము, పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు, స్త్రీ- వీరియందు అగ్నిబుద్ధిని ఉంచి వీనిని ధ్యానించుట అధ్యాస మనబడును.

ఛాందోగ్యమునందు 5 వ అధ్యాయమున నాలుగవఖండము నుండి 8 వ ఖండమువరకు ఇవి వర్ణించబడినవి. ఇందు ద్యులోకమును పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు, యోష (స్త్రీ) అను ఈ 5 పదార్థముల యందును అగ్నిని చింతన చేయవలెనని ఉన్నది. అనగా వానిని అగ్నిరూపమున ఉపాసించవలెను.

1. "*అసౌ వావ లోకో గౌతమాగ్నిః*:— ద్యులోకమునకు అగ్నికి ఆదిత్యుడు సమిధ, కిరణములు ధూమము, దినములు జ్వాలలు, చంద్రుడు అంగారము, నక్షత్రములు విస్ఫులింగములు. ఇట్టి ద్యులో

కాగ్నియందు ఆపము అను శ్రద్ధను హోమము చేయవలెను. పై ద్యులోకాగ్నియందు క్రమముగా సమిధ, ధూమము, అర్చి, అంగార, విస్ఫులింగబుద్ధిని చింతన చేయవలెను.

2. "పర్జన్యో వావ గౌతమాగ్నిః":— పర్జన్యాగ్నికి వాయువు సమిధ, అభ్రము ధూమము, విద్యుత్ అర్చి, అశని అంగారము, గర్జితము విస్ఫులింగము. ఈదృష్టిని చింతన చేయవలెను.

3. "పృథివీ వావ గౌతమాగ్నిః":— పృథ్వియను అగ్నికి సంవత్సరములు, రాత్రులు, దిక్కులు, విదిక్కులు క్రమముగా సమిధ, ధూమము, అర్చి, అంగారము, విస్ఫులింగము అనుభావముతో ఉపాసించవలెను.

4. పురుషో వావ గౌతమాగ్నిః :—పురుషాగ్నికి శిరోజములు, ప్రాణములు, జిహ్వ, చక్షువు, శ్రోత్రము— అనునవి క్రమముగా సమిధ, ధూమము, అర్చి, అంగారము, విస్ఫులింగము అని ఉపాసించవలెను.

5. "యోషా వావ గౌతమాగ్నిః :—స్త్రీ యనెడు అగ్నికి ఉపస్థము, ఉపమంత్రణము, యోని, అంతఃకరణము, అభినందనము క్రమముగా సమిధ, ధూమము, అర్చి, అంగారము, విస్ఫులింగము అనెడి భావనతో ఉపాసించవలెను.

ఈపంచాగ్నులకును హోమద్రవ్యములు జలరూపమగు శ్రద్ధ, సోమము, వర్షము, అన్నము, రేతస్సు.

పంచాగ్నులను ఉపాసించుట వలన కలుగు ఫలము అర్చిరాది మార్గమున హిరణ్యగర్భలోకప్రాప్తి. ఇది శ్రుతిప్రతిపాదితమగు ప్రతీక అధ్యాసోపాసన. వస్తుతః ప్రతీకోపాసన సంఘోపాసన

అనియు, అధ్యాసోపాసన అనియు రెండురకములు. సంపదుపాసనము ఆరోప్యప్రధానము.

అధ్యాసోపాసనము అధిష్ఠానప్రధానము. ఆరోప్యప్రధానమగు సంపదుపాసనమందు సగుణబ్రహ్మముయొక్క మూర్తియందు సగుణబ్రహ్మమును చింతన చేయుదురు.

ఉద్గీథోపాసనకూడః ఆరోప్యప్రధానమయినందున సంపదుపాసనమునందు అంతర్భూతమగును. అధిష్ఠానప్రధానమగు అధ్యాసోపాసనమునందు అధిష్ఠానమును ఉద్దేశించి ఆరోప్యపదార్థమును ధ్యానింపవలెను.

యోషయందు అగ్నిచింతనము, సగుణచింతనమునందు నిర్గుణబ్రహ్మానుసంధానము, ఇట్టి దృక్పథముతో ప్రతీకోపాసనము సంపదుపాసనమనియు, అధ్యాసోపాసనమనియు రెండు రకములు.

## బ్రహ్మముయొక్క సంవర్గోపాసన.

క్రియాయోగేన చోపాసావిధిః సంవర్గ ఉచ్యతే ।
సంహృత్యా వాయుః ప్రలయే భూతాన్యేకోఽవసీదతి ॥ (శి. గీ)

క్రియాయోగమున ఉపాసించుపద్ధతి సంవర్గోపాసన. ప్రళయకాలమున సంవర్తవాయువు సకలభూతములను నశింపజేయును.

చంద్రుడు అస్తావస్థాసమయమున వాయులీనుడగును. జలము ఎండిపోయినపుడు వాయుగతమగును. ఇట్లు వాయువు అగ్న్యాది మహాబలసంపన్నమగు పదార్థములను వశపరచుకొనును. దాని గుణము సంవర్గము. దాని ఉపాసన సంవర్గోపాసన. అధ్యాత్మసంవర్గోపాసన ఛాందోగ్యమున చెప్పబడినది.

ముఖ్యమగు ప్రాణమును సంవర్గగుణయుక్తముగా గ్రహించి దానిని ఉపాసించవలెను. మనుష్యుడు నిద్రించునప్పుడు అతని వాక్కు, చక్షువులు, శ్రోత్రములు, మనస్సు అన్నియును ప్రాణమున

లీనమగును. అనగా శయనకాలమున వాగాదులను ప్రాణవాయువు వశమునందుంచుకొనును.

దేవతలయందు బహిర్గతమగు వాయువు సంవర్గము. వాగాది ఇంద్రియములలో ముఖ్యమగు ప్రాణము సంవర్గము. పూర్వోక్త విధానమున ప్రలయకాలమున సంవర్తనామకమగు వాయువు తన శక్తిచే అగ్న్యాదులను వశపరచుకొని ఉండును. కావున దానిని సంవర్గరూపమున ఉపాసించవలెను.

ఇట్లు అగ్న్యాదులను, వాగాదులను వశపరచుకొనుట అను కర్మను నిమిత్తముగా గైకొని చేయు ఉపాసన సంవర్గోపాసన.

సంవర్గోపాసనయందు సంవర్గగుణముకల వాయువును ధ్యానించవలెను. అటులనే ముఖ్యమగు ప్రాణము శయనకాలమున వాగాదులను వశపరచుకొనును. కావున దానిని ధ్యానించవలెను. ఇచ్చట కూడ వాగాదులను వశపరచుకొనుట అను కర్మమును ఆధారముగా జేసికొని ప్రాణమును సంవర్గరూపమున ఉపాసించవలెను.

సంవర్గోపాసన అధిదేవ, అధ్యాత్మ భేదమున రెండురకములు. ఛాందోగ్యమునందు "వాయుర్వావ సంవర్గః, ప్రాణో వావ సంవర్గః" అని చెప్పబడినది.

## జ్ఞా న ము

ప్రపంచమునందలి అన్ని వ్యవహారములకును అసాధారణ కారణము జ్ఞానము. ప్రదార్థజ్ఞానము లేనిదీ పదార్థసంబంధమగు వ్యవహారము జరుగదు. జ్ఞానము పరోక్షము, అపరోక్షము అని రెండురకములు. భేదవిశిష్టమును, విషయవిషయకమును అగు జ్ఞానము పరోక్షజ్ఞానము. పరోక్షజ్ఞానము కలుగనిదే ఏపదార్థముయొక్కయు అపరోక్షజ్ఞానము కలుగదు అపరోక్షజ్ఞానము చక్షురాది ఇంద్రియ ములద్వారాను, అభేదబోధకములగు వాక్యములద్వారాను కలు

గును. కర్మలు నిష్కామముగను, సకామముగను చేయబడును. అవి కూడ ఆశబ్దవిషయకజ్ఞానముచేతనే చేయబడును. కావున కర్మకుకూడ జ్ఞానమే కారణము. అటులనే ఉపాసనకుకూడ జ్ఞానమే కారణము. కారణమేమన, ఉపాస్యపదార్థముయొక్కయు, ఉపాసనాసాధనము యొక్కయు జ్ఞానము కలుగనిచో ఉపాసన జరుగదు. ఉపాసనయు, జ్ఞానమును రెండును మనోవృత్తులు.

క్రియా, కారక, ఫల విభాగశూన్యమగు కూటస్థరూపమగు ఆత్మయందు అవిద్యాకృతములగు కర్త్రాదికారకవిషయముల ఆరోపము, ఆ ఆరోపితవిజ్ఞాననివర్తకము నగు మనోవృత్తి అద్వైతజ్ఞానము.

మహావాక్యజన్యమగు అపరోక్షజ్ఞానము మోక్షమునకు హేతువు. వేదాంతవాక్యములు మహావాక్యములు, అవాంతరవాక్యములు అని రెండురకములు.

## జీవాత్మ పరమాత్మల స్వరూపమును బోధించునవి అవాంతరవాక్యములు.

జీవాత్మపరమాత్మల స్వరూపమును బోధించు వాక్యములు అవాంతరవాక్యములు. ఉదా:- "య ఏష హృద్యన్తర్జ్యోతిర్పురుషః" "హృదయాంతర్గతమగు జ్యోతియే పురుషుడు. ఇది జీవుని ప్రతిపాదించు అవాంతరవాక్యము. "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అనునది బ్రహ్మప్రతిపాదకమగు అవాంతరవాక్యము.

జీవబ్రహ్మల అభేదమును ప్రతిపాదించునవి మహావాక్యములు. ఉదా:- "తత్త్వమసి" "అది నీవు. "శ్రోత్రసంబంధముచే అవాంతర వాక్యములద్వారా బ్రహ్మముయొక్క పరోక్షజ్ఞానము కలుగును. "జీవుడు బ్రహ్మము." శ్రోత్రసంబంధముచే మహావాక్యములద్వార బ్రహ్మముయొక్క అపరోక్షజ్ఞానము కలుగును, ఉదా:- "అహం బ్రహ్మాస్మి" "నేను బ్రహ్మము."

వ్యవధానశూన్యమగు వస్తువుయొక్క శబ్దముద్వారా పరోక్ష జ్ఞానము, అపరోక్షజ్ఞానము రెండును కలుగును.

ఎక్కడ వ్యవధానశూన్యపదార్థము అస్తిత్వముచే తెలిసికొనబడునో అక్కడ పరోక్షజ్ఞానము. వ్యవధానశూన్యపదార్థము అటులనే తెలిసికొనబడినచోట అపరోక్షజ్ఞానము నెరుగవలెను. ఉదా:— "*దశమస్త్వమసి*" అను కథలో దశమపురుషజ్ఞానము.

బ్రహ్మము అన్నిటికిని ఆత్మ. అన్నివిధముల అన్నిటికిని వ్యవధానశూన్యమే అయినచో శబ్దముచే "బ్రహ్మాస్తి" "బ్రహ్మము ఉన్నది" అని ఉచ్చరించుటచే పరోక్షజ్ఞానమే కలుగును. కావున వ్యవధానశూన్యమగు బ్రహ్మముయొక్కకూడ పరోక్షజ్ఞానమే శ్రోత్రమునకు సంబంధించిన అవాంతరవాక్యముచే కలుగును. వ్యవధానశూన్యమగు ఆత్మకు బ్రహ్మభిన్నమగు శ్రోత్రసంబంధముకల మహావాక్యములద్వారా అభేదాపరోక్షజ్ఞానము కలుగును. ఉదా:— "నేను బ్రహ్మము." "కావున జీవబ్రహ్మభేదమునకు మహావాక్యజన్య జ్ఞానము కారణము. ప్రమాణగత అసంభావన, ప్రమేయగత అసంభావన, విపరీతభావన ఈమూడును— జ్ఞానప్రతిబంధకములు. వాటిని పోగొట్టుటకు శ్రవణ, మనన, నిదిధ్యాసములను ప్రతిదినము ముముక్షువు సేవించవలెను. వానిచే జ్ఞానమార్గమున విఘ్నములు రావు. జ్ఞానములేనిదే ముక్తి లేదు అని శృతి ఘోషించుచున్నది.

"*తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ*" ముముక్షువు ప్రత్యగభిన్న పరమాత్మని స్వస్వరూపమున తెలిసికొని ప్రపంచమున మృత్యువు దాటును. స్వస్వరూపప్రాప్తికి జ్ఞానముతప్ప వేరొకమార్గము లేదు. జీవబ్రహ్మముల అభేదజ్ఞానము కలుగనిదే మోక్షము కలుగదని శ్రీశంకరులు చెప్పిరి.

న యోగేన న సాంఖ్యేన కర్మణా నో న విద్యయా,
బ్రహ్మాత్మైకత్వబోధేన మోక్షః సిధ్యతి నాన్యథా॥

"యోగము, సాంఖ్యము, కర్మ, విద్య (ఉపాసన)-వీనిచే మోక్షము కలుగదు. బ్రహ్మాత్మాభేదజ్ఞానముచేతనే కలుగును." అది వేదాంత మహావాక్యములద్వారానే జరుగును.

## బ్రహ్మాత్మైక్యమును బోధించు వేదాంత మహావాక్యములు.

వేదాంతమునందలి జీవబ్రహ్మాభేదమును బోధించు వాక్యములు మహావాక్యములు. మహావాక్యములు అనంతములు. కాని నాల్గువేదములనుండియు ఒక్కొ-కటి మహావాక్యముద్వారా గురువులు శిష్యులకు అభేదమును బోధించిరి. ఋగ్వేదమునందలి ఐతరేయ ఆరణ్యకమునుండి "ప్రజ్ఞానం బ్రహ్మ" అనునది గ్రహించబడినది. యజుర్వేదమునందలి బృహదారణ్యకోపనిషద్గతమగు "అహం బ్రహ్మాస్మి" అను మహావాక్యము స్వీకరించబడినది. సామవేదమునందలి ఛాన్దోగ్యోపనిషద్గతమగు "తత్త్వమసి" గైకొనబడినది. అటులనే అథర్వణవేదమునందలి "అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యము తీసికొనబడినది. "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యమున "ప్రజ్ఞానము, బ్రహ్మ" అను రెండుపదములు కలవు. ప్రజ్ఞానమనగా చైతన్యము. ఈ చైతన్యము సర్వేంద్రియనిర్గత అంతఃకరణవృత్త్యుపలక్షితము. దేవ, మనుష్య, దానవ, అశ్వ, గవాది శరీరధారులయందును, ఆకాశాదిభూతములయందును జగజ్జన్మాది హేతుభూతమగు చైతన్యము బ్రహ్మపదార్థము. ఆప్రజ్ఞానమే బ్రహ్మము. (అది నేనే). "అహంబ్రహ్మాస్మి" ఇందు "అహం, బ్రహ్మ, అస్మి" అను మూడుపదములు కలవు. పరమాత్మ సర్వవిధముల పరిపూర్ణుడు; స్వభావముచే దేశ, కాల, వస్తువులచే పరిచ్ఛిన్నుడు కాడు. మాయాపరికల్పిత

ప్రపంచమున, విద్యాధికారియు, శమాదిసాధవ సంపన్నుడును, శ్రవణాది అనుష్ఠానపరుడును, అగు మానవునిచే శరీరములయందు బుద్ధ్యుపలక్షితమగు సూక్ష్మశరీరమునకు సాక్షి. ప్రకాశకత్వాది గుణముల నాధారముగా చేసికొని "అహం" పదమునకు "సాక్షి" అని అర్థము చెప్పవచ్చును. "అస్మి" అను పదముతో "అహం, బ్రహ్మ" పదములు సమానాధికరణము లగుటచే "జీవబ్రహ్మ" ఐక్యము తెలియును. కావున "నేను సాక్షిరూపుడగు బ్రహ్మమును" అని ఈమహావాక్యమునకు అర్థము.

"తత్త్వమసి" అను మహావాక్యమున "తత్, త్వం, అసి" మూడు పదములు కలవు. స్వగతాది భేదరహితమును, నామరహితమును, సృష్టికి పూర్వమునందును, ఉత్తరకాలమునందును ఉండునదియు, లక్షణాప్రతిపాదితమును, అగు సద్వస్తుసమచైతన్యము "తత్" పదార్థము.

శ్రవణాద్యనుష్ఠానములద్వారా మహావాక్యార్థమును గ్రహించు, దేహేంద్రియాది భిన్నమును, దేహేంద్రియ ఉపలక్షితమును, శరీరత్రయసాక్షియునునగు సద్వస్తురూపచైతన్యము "త్వం" పదముయొక్క లక్ష్యార్థము.

మహావాక్యమునందలి లక్షణచే "తత్, త్వం" పద సమానాధికరణలభ్యమగు ఉభయపదార్థైక్యము ప్రవచనరూపమగు మహావాక్యార్థము.

"అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యమున మూడు పదములు కలవు. "అయమ్, ఆత్మా, బ్రహ్మ." "అయం" పదముచే అపరోక్షమును, స్వయం ప్రకాశమును అగు బ్రహ్మము గ్రహించబడును. "ఆత్మ" శబ్దముచే "అహంకారము, ప్రాణము, మనస్సు

ఇంద్రియములు, దేహాదులు- వీనికి భిన్నమగునదియు, వాని అన్నిటికిని ప్రత్యగధిష్ఠానమును, సాక్షియును అగు అంతరాత్మ తెలిసికొనబడును. ఈమహావాక్యము ఆత్మశబ్దార్థమును నిర్వచించును. ఆకాశాది సర్వజగదధిష్ఠానమును, సర్వమునకును బాధావశేషమును, పరమార్థయుక్తమును అగు సచ్చిదానందరూపచైతన్యము బ్రహ్మపదార్థము.

## నిష్కామకర్మతోబాటు మహావాక్యవిచారముచే జ్ఞానోదయము.

ఈ ప్రకారము బ్రహ్మనిష్ఠుడును, బ్రహ్మశ్రోత్రియుడును అగు మహాత్మునిద్వారా మహావాక్యవిచారము చేయుటవలన ఆవరణనాశకమగు అపరోక్షజ్ఞానము కలుగును. స్వరూపసాక్షాత్కారము అయిన జ్ఞానికి శ్రవణ, మనన, నిదిధ్యాసములు అవసరము లేదు. వామదేవాదిఋషులకు స్వరూపభ్రాంతి లేనందుననే శ్రవణాదులయందు ఇచ్ఛలేదు. దృఢమగు అపరోక్షజ్ఞానము వారికి కలుగుటచేతనే వారు శ్రవణాదులయందు ఇచ్ఛనొందకుండుటకు యోగ్యులు. కాని దృఢమగు అపరోక్షజ్ఞానము కలుగనంతవరకు ముముక్షువు శ్రవణాదులను సేవించి దృఢమగు అపరోక్షానుభూతిని పొందవలెను. ఆవిధముగనే, మలదోషపరిహారార్థము నిష్కామకర్మము నాచరించవలెను. పూర్వజన్మమున నిష్కామకర్మద్వారా మలదోషమును పోగొట్టుకొని జన్మించినవారుకూడ ఈజన్మయందు మలదోషము కలుగకుండుటకై నిష్కామకర్మ నాచరించవలెను. మలదోషము పోవనిదే చిత్తశుద్ధి లేదు. చిత్తశుద్ధిలేనిదే విరోచనాదులవలె దేహాత్మబుద్ధినే పొందుదురు కాని, స్వరూపసాక్షాత్కారము కలుగదు. నిష్కామకర్మముద్వారా అంతఃకరణశుద్ధి పరమార్థజ్ఞానమునకు సాధనము. అటులనే ఉపాసనారహితులుకూడ ఈజన్మమున ఉపాసనద్వారా విక్షేపదోష

మును పోగొట్టుకొని శ్రవణాదులయందు ప్రవృత్తులుకానిదే జ్ఞానమును పొందలేరు. విక్షేపదోషముచే దధీచిమహాముని చేసిన బ్రహ్మోపదేశమునందు ఇంద్రునికి అభిరుచి కలుగలేదు. అటులనే విక్షేపదోషము ఉండుటచే శ్రవణాదులు జరుగవు. ఆవిధముగా స్వరూపసాక్షాత్కారము జరుగదు.

కావున నిష్కామకర్మము, ఉపాసన- ఈరెంటిద్వారా మలదోషము విక్షేపదోషము- ఈరెంటిని పోగొట్టుకొని బ్రహ్మనిష్ఠుడగు మహాత్మునిచెంత శ్రవణాద్యనుష్ఠానముచే మహావాక్యజన్యమగు దృఢమైన అపరోక్షానుభూతిని పొందవలెను.